పీహెచ్‌డీ సబ్జీవాలా

పీహెచ్‌డీ, 4 మాస్టర్ డిగ్రీలున్నా కూరగాయలు అమ్ముకుంటూ జీవనం

న్యూఢిల్లీ, జనవరి 1: పేరు చివరన అనేక డిగ్రీలున్నా, ఉన్నత చదువులు పూర్తిచేసినా.. ఓ పంజాబీ వ్యక్తి వీధిలో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 39 ఏండ్ల సందీప్ సింగ్ నాలుగు పీజీలు, ఓ పీహెచ్‌డీ అందుకున్నారు. సరైన ఉద్యోగం దొరక్క ఇంటింటికీ తిరుగుతూ కూరగాయలు అమ్ముతున్నారు. కాంట్రాక్ట్ ప్రొఫెసర్‌గా కన్నా.. కూరగాయలు అమ్ముతూ ఎక్కువ సంపాదిస్తున్నానని అతడు చేసిన వ్యాఖ్యలు ఇటీవల మీడియాలో వైరల్‌గా మారాయి. తన కూరగాయల బండికి 'పీహెచ్‌డీ సబ్జీవాలా' అనే బోర్డ్ కూడా తగిలించాడు. సందీప్ సింగ్ తొలుత పంజాబ్ యూనివర్సిటీ లా విభాగంలో 11 ఏండ్లపాటు కాంట్రాక్ట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఉద్యోగం చేస్తూనే పంజాబీ, జర్నలిజం, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల్లో పీజీ పూర్తిచేశారు. అయితే సమయానికి వేతనాలు సరిగా రాకపోవటం, అందులో కోతలు విధించటంతో కాంట్రాక్ట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని అతడు వదిలేయాల్సి వచ్చిందట. 'వేతనం ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. దీంతో ఆ ఉద్యోగాన్ని వదిలేశాను. కుటుంబ పోషణ కోసం కూరగాయలు అమ్ముతున్నా' అని సందీప్ సింగ్ చెప్పుకొచ్చారు. అయితే టీచింగ్‌పై ఉన్న మక్కువ పోలేదని, కొంత డబ్బు పొదుపు చేసి.. ఏదో ఒక రోజు ట్యూషన్ సెంటర్ ప్రారంభిస్తానని తన ఆకాంక్షను వెలిబుచ్చారు.

ధూమపానం మాన్పించే పిల్!

యూకేలో త్వరలో అందుబాటులోకి

లండన్, జనవరి 1: పొగ తాగే అలవాటు మానుకోవాలనుకొనేవారికి శుభవార్త! ధూమపానం వ్యసనం నుంచి విముక్తి పొందాలనుకొనే వారి కోసం లాబర్నమ్ చెట్ల నుంచి సహజ సిద్ధంగా తయారుచేసిన సిటిసైన్ మందు బిళ్లలు ఇంగ్లండ్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ మందు బిళ్లలను మధ్య, తూర్పు యూరప్‌లలో దశాబ్దాలుగా వాడుతున్నారు. అర్జెంటీనా పరిశోధకుల ప్రకారం నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ కంటే సిటిసైన్ మందులు సమర్థంగా పనిచేస్తాయి. యాదృచ్ఛికంగా నిర్వహించిన 12 ట్రయ్సల్‌లో ఈ విషయం తేలింది. ఇవి చౌకైన మందులని.. ప్రపంచవ్యాప్తంగా ధూమపానం మానేయాలనుకొనేవారికి ఎంతో ఉపకరిస్తాయని వారు తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తాజా పరిశోధనల ప్రకారం ఈ-సిగరెట్లు, వరెనిక్లైన్ మందులతో పాటు సిటిసైన్ మందులు ధూమపానం అలవాటును మానేయడానికి బాగా దోహదం చేస్తాయి. ప్లాసిబో విధానంతో పోలిస్తే సిటిసైన్ బిళ్లలు ధూమపానం మానేయడంలో రెండింతలు సమర్థంగా పనిచేస్తాయని పరిశోధకులు కనుగొన్నారు. సిటిసైన్ పిల్స్ ఈ నెలాఖరు నుంచి యూకే మార్కెట్లో అందుబాటులోకి రానున్నాయి. అయితే 25 రోజుల కోర్సుల మందుల ధర 115 పౌండ్లు ఉండొచ్చని చెప్పున్నారు. ఈ పరిశోధన వివరాలు అడిక్షన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఎక్స్‌పోశాట్ సక్సెస్

కొత్త ఏడాదిని ఘనంగా ప్రారంభించిన ఇస్రో

నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్‌ఎల్‌వీ సీ 58 | కృష్ణబిలాలపై అధ్యయనమే ప్రధాన లక్ష్యం | ఈ ప్రయోగం చేపట్టిన రెండో దేశంగా భారత్

నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్‌ఎల్వీ-సీ58 రాకెట్

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నూతన సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభించింది. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఎక్స్‌రే పొలారి మీటర్ ఉపగ్రహం (ఎక్స్‌పోశాట్)ను పీఎస్‌ఎల్వీ-సీ58 రాకెట్ ద్వారా విజయవంతంగా ప్రయోగించింది. 25 గంటల కౌంట్‌డౌన్ తర్వాత సోమవారం ఉదయం 9:10 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. దీని ద్వారా భారత్‌కు చెందిన 480 కిలోల ఎక్స్‌పోశాట్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపించారు. ప్రయోగం తర్వాత 21 నిమిషాలకు ఎక్స్ పోశాట్ నిర్దిష్ట కక్ష్యలోకి చేరుకుందని ఇస్రో శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ ప్రయోగంలో కేరళలోని తిరువనంతపురం ఎల్‌బీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కాలేజ్ విద్యార్థినులు తయారుచేసిన విమెన్ ఇంజినీర్డ్ శాటిలైట్ సహా వివిధ పేలోడ్‌లు కూడా ఉన్నాయి. వీటి సాయంతో శాస్త్రవేత్తలు పలు అంశాలపై అధ్యయనం చేయనున్నారు.

అమెరికా తర్వాత మనమే..

ఈ ఎక్స్ పోశాట్ ప్రయోగం భారత అంతరిక్ష ఆధారిత ఎక్స్‌రే ఖగోళ శాస్త్రంలో సంచలనాత్మక పురోగతికి తొలి అడుగు కానుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ముఖ్యంగా ఇమేజింగ్, టైం-డొమైన్ అధ్యయనాలు, స్పెక్ట్రోస్కోపీపై దృష్టి సారించిన గత ప్రయోగాల లాగా కాకుండా.. ఎక్స్‌రే ఖగోళ శాస్త్రానికి ఒక కొత్త కోణాన్ని పరిచయం చేస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఎక్స్‌రే మూలాలను అన్వేషించడం ఎక్స్ పోశాట్ లక్ష్యమని తెలిపారు. అయితే ఇలాంటి ప్రయోగం ప్రపంచంలోనే రెండోదని.. భారత్ కంటే ముందు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా మాత్రమే ఇలాంటి ప్రయోగం చేసిందని వెల్లడించారు. అగ్రరాజ్యం 2021లో ఐఎక్స్‌పీఈ పేరిట ఈ తరహా ప్రయోగం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

బ్లాక్‌హోల్స్‌పై అధ్యయనం

ఎక్స్ పోశాట్ జీవితకాలం అయిదేళ్లు. కృష్ణ బిలాలను అర్థం చేసుకోవడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం. ఎక్స్‌రే ఫొటాన్లు, వాటి పొలరైజేషన్‌పై అధ్యయనం ద్వారా కృష్ణబిలాలు, న్యూట్రాన్ స్టార్ల దగ్గర రేడియేషన్‌కు సంబంధించిన వివరాలను ఎక్స్‌పోశాట్ బహిర్గతం చేస్తుంది. పీఎస్‌ఎల్‌వీ చివరి దశలో మరో 10 పరికరాలను నింగిలోకి మోసుకెళ్లింది. దీనికి పీఎస్‌ఎల్‌వీ ఆర్బిటల్ ఎక్స్ పెరిమెంటల్ మాడ్యూల్ అని పేరు పెట్టారు.

సొంత స్పేస్ స్టేషన్ దిశగా..

సొంత అంతరిక్ష కేంద్రం దిశగా ఇస్రో కీలక ముందడుగు వేసింది. సరికొత్త ఫ్యూయెల్ సెల్‌ను దిగువ భూకక్ష్యలో ప్రవేశపెట్టింది. పీఎస్‌ఎల్‌వీ సీ58 ద్వారా ఎక్స్‌పోశాట్‌తోపాటు మరో 10 ఉపగ్రహాలను నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశపెట్టారు. వాటిలో ఈ ఫ్యూయెల్ సెల్ పవర్ సిస్టమ్ కూడా ఒకటి. రోదసిలో సమర్థవంతమైన శక్తి వనరును భారత్‌కు అందించడానికి ఇది దోహదపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. సుదీర్ఘ కాలం ఇది స్పేస్ స్టేషన్‌కు ఇది కరెంట్ సరఫరా చేయగలదని చెప్పారు.

2024.. గగన్‌యాన్ ఏడాది: సోమనాథ్

కొత్త ఏడాదిలో కొత్త విజయాన్ని అందుకున్నామని ఇస్రో చైర్మన్ సోమనాథ్ అన్నారు. 'పీఎస్‌ఎల్‌వీ-సీ58 వాహన నౌక ఎక్స్‌పోశాట్‌ను నిర్దిష్ట కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఇది ఆరంభం మాత్రమే. ఈ ఏడాది మరిన్ని కీలక ప్రయోగాలున్నాయి. ఈ ఏడాది.. గగన్‌యాన్ సంవత్సరంగా నిలిచిపోతుంది' అని పేర్కొన్నారు.

మరో శిఖరం చేరిన ఇస్రో: సీఎం రేవంత్

ఇస్రో చేపట్టిన పీఎస్‌ఎల్‌వీ-సీ58 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రయోగంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బ్లాక్ హోల్స్‌ను అధ్యయనం చేయడానికి అమెరికా తర్వాత అబ్జర్వేటరీ ఉపగ్రహం ఉన్న రెండో దేశంగా భారతదేశం అవతరించిందని సీఎం చెప్పారు. కొత్త సంవత్సరం మొదటి రోజే మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో రోదసిలో భారత పతాకాన్ని ఘనంగా ఎగురవేసిందన్నారు. పీఎస్‌ఎల్‌వీ- సీ58 విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో మరో శిఖరం చేరిందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్ సంస్థ కీలక పాత్ర

ఎక్స్‌పోశాట్ ప్రయోగంలో హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కీలక పాత్ర పోషించింది. ప్రయోగానికి అవసరమైన కీలక పరికరాలను ఈ సంస్థ సరఫరా చేసింది. స్టార్ సెన్సన్, ఆల్టిట్యూడ్ ప్రాసెసింగ్ యూనిట్, అడ్వాన్స్‌డ్ టెలిమెట్రీ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ డాటా అక్విజిషన్ మాడ్యూల్స్, పైరో కంట్రోల్ సిస్టమ్స్ తదితరవాటిని అందజేసింది.

మసూద్ అజహర్ హతం?

> మొదటిపేజీ తరువాయి...

మసూద్ మరణించినా.. దానిపై పాక్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం లేదు. పాకిస్థాన్‌లో గత కొన్ని నెలలుగా గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో ఉగ్రవాదులు హతమవుతున్న ఘటనలు చోటుచేసుకొంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా వైరల్ అవుతున్న మసూద్ మృతి వార్తకు ప్రాధాన్యం సంతరించుకొన్నది.

భారత్‌లో ఉగ్రదాడుల వెనుక మసూద్

పాక్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్ అగ్రనేతగా మసూద్ ఉన్నాడు. భారత్‌లో పలు ఉగ్రదాడుల వెనక మసూద్ హస్తమున్నది. 1995లో భారత్ అతడిని అరెస్ట్ చేసింది. అయితే 1999లో కాందహార్ విమాన హైజాక్ ఘటనతో భారత్ అతడిని విడుదల చేయాల్సి వచ్చింది. అనంతరం అతడు జైషే ఉగ్రవాద సంస్థను స్థాపించాడు. 2001లో పార్లమెంట్‌పై దాడి, 2008లో ముంబై పేలుళ్లు, 2019లో పుల్వామా ఉగ్రదాడులకు మసూద్ ప్రధాన సూత్రధారిగా ఉన్నారు.

సారేన్ భార్యకు సీఎం పగ్గాలు!

బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే సంచలన వ్యాఖ్యలు

రాంచి: అవినీతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ తన పదవికి రాజీనామా చేస్తారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. భూ కుంభకోణం కేసులో ఆయనను ఈడీ అరెస్టు చేసేందుకు సిద్ధమవుతున్నదని వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో సోరేన్ సీఎం పదవికి రాజీనామా చేసి.. తన భార్య కల్పనకు పగ్గాలు అప్పగిస్తారని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే సంచలన వ్యాఖ్యలు చేశారు. విచారణకు హాజరుకావాల్సిందిగా ఈడీ నుంచి సీఎం సొరెన్‌కు ఏడోసారి సమన్లు వెళ్లాయి. ఇది జరిగిన కొద్ది గంటల్లోనే జేఎంఎం ఎమ్మెల్యే ఒకరు తన పదవికి రాజీనామా చేయటం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపింది. పండేండ్ల క్రితం నాటి భూమి పత్రాల్ని ఫోర్జరీ చేసి, వాటిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని, వివాదాస్పద స్థలాలన్నీ సీఎం సొరేన్ ఆధీనంలో ఉన్నాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది.

టీఎంసీలో సీనియర్లు వర్సెస్ జూనియర్లు

కోల్‌కతా: మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సోమవారంతో 27వ ఏట అడుగు పెట్టింది. అయితే ఇటీవల ఈ పార్టీలో సీనియర్లు, జూనియర్ల మధ్య విభేదాలు ముదిరాయి. మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనప్పటి నుంచి ఇది కొనసాగుతున్నది. పార్టీ వ్యవహారాలపై సీనియర్లు, జూనియర్లు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకొనేంత వరకూ పరిస్థితి వెళ్లింది. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సంబరాల నేపథ్యంలో పలువురు సీనియర్లు అభిషేక్‌ను టార్గెట్‌గా చేసుకొని విమర్శలు చేశారు. దీనికి ఆయన వర్గం నేతలు కౌంటర్ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో అభిషేక్ బెనర్జీ సోమవారం సాయంత్రం పార్టీ అధినేత్రి మమతను ఆమె నివాసంలో కలవడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. సీనియర్లు రాజకీయాల నుంచి తప్పుకోవాలన్న వాదనలను గత నెల తోసిపుచ్చిన అధినేత్రి మమత.. సీనియర్ నేతలను జూనియర్లు గౌరవించాలని సూచించారు. రాజకీయాల్లో ఒక రిటైర్‌మెంట్ వయసు అంటూ ఉండాలని అభిషేక్ బెనర్జీ వాదిస్తున్నారు.

నేటి నుంచి ఎలక్టోరల్ బాండ్ల విక్రయం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు విరాళాలివ్వడం కోసం ఉద్దేశించిన ఎలక్టోరల్ బాండ్ల 30వ విడత అమ్మకాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయి. రాజకీయ పార్టీల నిధులు పారదర్శకంగా ఉండాలనే లక్ష్యంతో నగదు విరాళాలకు బదులుగా, వీటిని ప్రభుత్వం తీసుకొచ్చింది. 17వ లోక్‌సభ గడువు పూర్తి కావస్తుండటంతో ఈ ఏడాదిలో ఎన్నికలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటిని భారతీయ స్టేట్ బ్యాంకు తన 29 ఆథరైజ్డ్ బ్రాంచ్‌ల ద్వారా జనవరి 2 నుంచి 11 వరకు విక్రయిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం తెలిపింది.

కొత్త క్రిమినల్ చట్టాలపై సుప్రీంకోర్టులో పిల్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మూడు నేర న్యాయ చట్టాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. వీటిలో అనేక లోపాలు, వైరుధ్యాలు ఉన్నాయని పిటిషనర్ ఆరోపించారు. కొత్త చట్టాలు మరో మూడు లేదా నాలుగు నెలల్లో అమల్లోకి వస్తాయి. ఈ మూడు చట్టాలను సవాల్ చేస్తూ అడ్వకేట్ విశాల్ తివారీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పార్లమెంటులో ప్రతిపక్ష సభ్యులు సస్పెన్షన్‌లో ఉన్నపుడు, ఎటువంటి చర్చ లేకుండా వీటిని ఆమోదించారని తెలిపారు. వీటి ఆచరణ సాధ్యతను మదింపు చేయడం కోసం నిపుణుల కమిటీని తక్షణమే నియమించాలని కోరారు.

వాణిజ్య సిలిండర్‌పై రూపాయిన్నర తగ్గింపు

న్యూఢిల్లీ: వాణిజ్య సిలిండర్ ధరలను చమురు సంస్థలు సవరించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై రూపాయిన్నర తగ్గిస్తున్నట్టు సోమవారం పేర్కొన్నాయి. తాజా తగ్గింపుతో ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1755.5, ముంబైలో 1708.5గా ఉన్నది. అయితే గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీల సిలిండర్ ధరలో మాత్రం చమురు సంస్థలు ఎలాంటి మార్పు చేయలేదు. మరోవైపు విమాన ఇంధనం ఏటీఎఫ్ ధరలను 3.9 శాతం(రూ.4,162.5) తగ్గిస్తున్నట్టు ఆయిల్ కంపెనీలు నోటిఫికేషన్‌లో పేర్కొన్నాయి.

మణిపూర్‌లో మళ్లీ హింస

కాల్పుల్లో నలుగురు మృతి

గువాహటి, జనవరి 1: మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. తౌబాల్ జిల్లాల్లోని లిలోంగ్ ఏరియాలో సోమవారం గుర్తుతెలియని కొందరు సాయుధ దుండగులు జరిపిన కాల్పుల్లో నలుగురు పౌరులు మరణించగా, పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన తర్వాత లోయలోని తౌబాల్, ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, కక్చింగ్, బిష్ణుపూర్ జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. కొందరు వ్యక్తులు ఆయుధాలతో వచ్చారని స్థానికులు పేర్కొన్నారు. తాజా హింసను ఖండించిన సీఎం బీరేన్ సింగ్.. ప్రజలు శాంతి పాటించాలని పిలుపునిచ్చారు. తాజా ఘటన నేపథ్యంలో ఆయన మంత్రులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం మణిపూర్ సరిహద్దు పట్టణమైన మోరేలో అనుమానిత తిరుగుబాటుదారులు జరిపిన కాల్పుల్లో నలుగురు భద్రతా సిబ్బంది గాయాలయ్యాయి.

అయోధ్య రామమందిరం కొలువుదీరనున్న వేళ.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 13 వేల అడుగుల ఎత్తులో రామమందిర జెండా రెపరెపలాడింది. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన సైడ్‌వెదర్ అనామిక శర్మ(22) బ్యాంకాక్‌లో రామమందిర జెండాతో ఆకాశంలో చక్కర్లు కొట్టారు.

కర్ణాటక శిల్పి చెక్కిన విగ్రహం ఎంపిక!

అయోధ్య, జనవరి 1: కర్ణాటకకు చెందిన ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన రామ్ లల్లా విగ్రహం అయోధ్య మందిరంలో ప్రతిష్ఠాపనకు ఎంపికైందని ఆ రాష్ట్ర మాజీ సీఎం యెడియూరప్ప సోమవారం వెల్లడించారు. ఈ విషయమై ఎక్స్‌లో ఆయన తన సంతోషాన్ని పంచుకుంటూ.. 'మైసూరుకు చెందిన అరుణ్ యోగిరాజ్ చెక్కిన విగ్రహం ప్రతిష్ఠాపనకు ఎంపిక కావడం రాష్ట్రంలోని రామభక్తుల సంతోషాన్ని, గౌరవాన్ని రెండింతలు చేసింది. యోగిరాజ్‌కు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు' అని పోస్ట్ చేశారు. దీనిపై శిల్పి యోగిరాజ్ స్పందిస్తూ తన విగ్రహం ఎంపికైన విషయమై అధికారిక సమాచారం లేదన్నారు.

నెతన్యాహూకు చుక్కెదురు

న్యాయ సంస్కరణల చట్టాన్ని రద్దు చేస్తూ ఇజ్రాయెల్ సుప్రీంకోర్టు తీర్పు

జెరూసలేం, జనవరి 1: న్యాయ సంస్కరణల పేరుతో ఇజ్రాయెల్‌లో నెతన్యాహూ ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద చట్టాన్ని ఆ దేశ సుప్రీంకోర్టు కొట్టేసింది. ప్రభుత్వ నిర్ణయాల్ని రద్దు చేసే అధికారం కోర్టులకు లేదంటూ తీసుకొచ్చిన చట్టం చెల్లుబాటు కాదని పేర్కొంటూ ఆ దేశ సుప్రీంకోర్టు ధర్మాసనం 8-7 మెజార్టీతో సోమవారం తీర్పు వెలువరించింది. సుప్రీంకోర్టు, దిగువ కోర్టుల అధికారాల్ని పరిమితం చేస్తూ ఈ ఏడాది జూలైలో నెతన్యాహూ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ఇజ్రాయెల్‌లో సంచలనం రేపింది. నెతన్యాహూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు హోరెత్తాయి. ముఖ్యమైన అధికార, రాజకీయ పదవుల్లో తనవాళ్లను నియమించుకునేందుకు నెతన్యాహూ ఈ చట్టాన్ని తీసుకొచ్చాడని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అక్టోబర్ 7న హమాస్ దాడి ఘటనతో ఈ అంశం తాత్కాలికంగా పక్కకుపోయింది.

కొలీజియం చర్చల్ని బహిరంగపర్చలేం

- **జడ్జీల నియామకాలపై సీజేఐ డీవై చంద్రచూడ్**
- **రాజ్యాంగం, చట్ట ప్రకారమే ఆర్టికల్ 370 రద్దు**

రాజ్యాంగం ప్రకారం వెళ్లాలి..

న్యూఢిల్లీ, జనవరి 1: కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేదన్న విమర్శల్ని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ కొట్టిపారేశారు. న్యాయమూర్తుల నియామకాలపై కొలీజియం చర్చల్ని బహిరంగ పర్చలేమని, నియామక ప్రక్రియను రికార్డు చేయటం, డాక్యుమెంటేషన్ చేయటమనేది భారత రాజ్యాంగంలో లేదని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు, స్వలింగ సంపర్కుల వివాహం.. తదితర అంశాలపై పీటీఐ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు విశ్వసనీయతను కొనసాగిస్తున్నామని, న్యాయవాదుల అభిప్రాయం మేరకు కేసుల కేటాయింపు ఉండదని సీజేఐ స్పష్టం చేశారు. 'కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేదన్న విమర్శ సరైంది కాదు. అత్యంత పారదర్శకంగా కొలీజియంను నిర్వహిస్తున్నాం' అని అన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించి కేసులో రాజ్యాంగం, చట్టం ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని అన్నారు.

సాంకేతికతను ఆయుధంగా వాడరాదు

ఆధార్ ఆధారిత వేతన చెల్లింపును తప్పనిసరి చేయడంపై కేంద్రంపై ప్రతిపక్ష పార్టీలు విరుచుకుపడ్డాయి. దేశంలోని కోట్లాది నిరుపేదలు, అణగారిన వర్గాల వారు ప్రాథమిక(బేసిక్) ఆదాయాన్ని సంపాదించుకోకుండామినహాయించే క్రూరమైన కొత్త ఏడాది కానుక ఇది అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం డిజిటల్ హాజరు, డ్రోన్లతో పర్యవేక్షణ లాంటి సాంకేతికతను ఆయుధంగా వాడుకుంటున్నదని ఆయన ఆరోపించారు. దీన్ని మానుకోవాలని హితవు పలికారు. ఉపాధి హామీ పథకానికి ప్రజాదరణ ఉన్నా ఇటీవల కాలంలో దాని బడ్జెట్‌లో కోతలు విధిస్తున్నారు. గతేడాది రూ.60 వేల బడ్జెట్ కేటాయించగా సవరించిన అంచనాలతో పోలిస్తే 33 శాతం కేటాయింపులు తగ్గించడంపై ఆందోళన వ్యక్తమైంది. ఈ పథకాన్ని 2013 నుంచి కాగ్ ఆడిట్ చేయడం లేదు.

పూరి జగన్నాథ ఆలయంలో డ్రెస్‌కోడ్

జీన్స్, షార్టులు, స్కర్టులు ధరిస్తే అనుమతి నిరాకరణ

పూరి: ఒడిశాలోని ప్రసిద్ధ పూరి జగన్నాథ ఆలయంలోకి ప్రవేశించే భక్తులు ఇకపై తప్పనిసరిగా డ్రెస్‌కోడ్‌ను పాటించాల్సిందే. జీన్స్, షార్టులు, స్కర్టులు, స్లీవ్‌లెస్ డ్రెసులు ధరిస్తే ఆలయంలోకి ప్రవేశం ఉండదు. ఈ నూతన నిబంధనలు జనవరి 1 నుంచే అమల్లోకి వచ్చాయి. దీంతో ఆలయ పరిసరాల్లో ఎక్కువ మంది పురుషులు ధోతీలతో, మహిళా భక్తులు చీరలు, సల్వార్ కమీజ్‌లతో కనిపించారు. ఆలయ విశిష్టతను కాపాడటానికి ఈ నిబంధనలు తీసుకొచ్చినట్టు అధికారులు చెప్పారు. ఆలయ పరిసరాల్లో గుట్కా, పాన్ మసాలాలు, ప్లాస్టిక్ సంచులను నిషేధించినట్టు వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఆధార్‌తోనే 'ఉపాధి' చెల్లింపులు

జాబ్‌కార్డ్, బ్యాంక్ ఖాతాతో అనుసంధానం తప్పనిసరి

జనవరి 1 నుంచే అమల్లోకి.. ఆధారే ఆర్థిక చిరునామా

కొత్త ఏడాది క్రూరమైన కానుకని విపక్షం మండిపాటు

న్యూఢిల్లీ, జనవరి 1: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతన చెల్లింపులు ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆధార్ ఆధారిత(ఏబీపీఎస్) విధానంలో జరగనున్నాయి. గత ఏడాది జనవరి 30 నుంచే ఈ విధానాన్ని తప్పనిసరి చేసినా, రాష్ట్ర ప్రభుత్వాలు తమ డాటా బేస్‌ను బలోపేతం చేసుకొనేందుకు అయిదుసార్లు పొడిగింపు ఇచ్చారు. ఈ కొత్త విధానం ప్రకారం ఉపాధి హామీ పథకం కూలీల జాబ్ కార్డు, బ్యాంక్ ఖాతా ఆధార్‌తో అనుసంధానమై ఉండాలి. ఆధార్ సంఖ్యను వ్యక్తుల ఆర్థిక చిరునామాగా ఈ విధానం ఉపయోగిస్తుంది. దాంతోపాటు బ్యాంక్ ఖాతా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 'మప్పర్'తో అనుసంధానమై ఉండాలి. ఏ రాష్ట్రానికి ఈ విషయంలో ఫిర్యాదులుంటే వ్యక్తిగతంగా ఒక్కొక్క కేసును చర్చిస్తామని చెప్పింది. లిబ్ టెక్ ఇండియా సంస్థ లెక్కల ప్రకారం గత 21 నెలల్లో 7.6 కోట్ల జాబ్ కార్డులను సిస్టమ్ నుంచి తొలగించారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరి 1 నాటికి 14.28 కోట్ల యాక్టివ్ వర్కర్లు ఉండగా అందులో 13.48 కోట్ల మంది ఆధార్ సీడింగ్ జరిగింది. 12.90 కోట్ల మంది ఆధార్‌ను ధ్రువీకరించారు. సుమారు 12.49 కోట్ల వర్కర్లు ఏబీపీఎస్‌కు మారారు. ఇంకా 12.5 శాతం యాక్టివ్ వర్కర్లు ఏబీపీఎస్‌లో వివరాలు నమోదు చేసుకోలేదు. ఉపాధి హామీ పథకంలో మొత్తం వర్కర్లు 25.89 కోట్లు ఉండగా వారిలో 17.37 కోట్ల మంది ఏబీపీఎస్‌కు మారారు. 32 శాతం వర్కర్లు ఏబీపీఎస్‌కు అర్హులు కారు. ఏబీపీఎస్‌ను తప్పనిసరి చేయడం వల్ల పథకం నుంచి వర్కర్లను మినహాయించాల్సిన పరిస్థితులకు దారి తీస్తుందని ఈ పథకంపై పరిశోధన చేస్తున్న లావణ్య తమంగ్ అభిప్రాయపడ్డారు. అధికార యంత్రాంగం, మౌలిక సదుపాయాలు సిద్ధంగా లేనప్పుడు ప్రభుత్వం ఒక విషయాన్ని తప్పనిసరి చేస్తే ప్రజలు ఉపాధిని కోల్పోతారని ఆమె అన్నారు.



పూరి జగన్నాథ ఆలయంలో డ్రెస్‌కోడ్

జీన్స్, షార్టులు, స్కర్టులు ధరిస్తే అనుమతి నిరాకరణ

పూరి: ఒడిశాలోని ప్రసిద్ధ పూరి జగన్నాథ ఆలయంలోకి ప్రవేశించే భక్తులు ఇకపై తప్పనిసరిగా డ్రెస్‌కోడ్‌ను పాటించాల్సిందే. జీన్స్, షార్టులు, స్కర్టులు, స్లీవ్‌లెస్ డ్రెసులు ధరిస్తే ఆలయంలోకి ప్రవేశం ఉండదు. ఈ నూతన నిబంధనలు జనవరి 1 నుంచే అమల్లోకి వచ్చాయి. దీంతో ఆలయ పరిసరాల్లో ఎక్కువ మంది పురుషులు ధోతీలతో, మహిళా భక్తులు చీరలు, సల్వార్ కమీజ్‌లతో కనిపించారు. ఆలయ విశిష్టతను కాపాడటానికి